
# నవభూమి

జిల్లా అనుబంధం

18 అక్టోబర్,2024 శుక్రవారం పేజిలు:7

www.epaper.navabhoomi.in

## పెండింగ్ ఎల్ఆర్ఎస్

# దరఖాస్తులను పరిష్కరించాలి

■ కలెక్టర్ జితేష్ వి పాటిల్




**కొత్తగూడెం అక్టోబర్ 17 నవభూమి ప్రతినిధి:** జిల్లాలో గ్రామపంచాయతీ స్థాయిలో పెండింగ్లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజిల్లాలోని గ్రామీణ స్థాయిలో ఉన్న ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తమ పరిధిలోకి వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను రోజుకు కనీసం 10 దరఖాస్తులు పూర్తి చేసేలా ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో ప్రభుత్వ భూమి,కోర్టు కేసులు, ఎఫ్ టి ఎల్ పరిధిలో ఉందా? అనే విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి భూమి వివరాలు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి ఎలాంటి పొరపాట్లు జరగకుండా వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లాలోని అందరూ తాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచి కిన్నెరసానిలో క్రీడాపోటీలు

**పాల్వంచ -నవభూమి** అక్టోబర్ 17: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన పాఠశాలల స్థాయి క్రీడాపోటీలు శు క్రవారం నుంచి రెండు రోజులపాటు కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్లో జరగనున్నాయి. ఏర్పాట్లను డిప్యూటీ డైరెక్టర్(డీడీ) మణెమ్మ గురువారం పరిశీలించారు. వ్యాయామ ఉపాధ్యాయులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. క్రీడాపోటీలను విజయవంతం చేయడంపై చర్చించారు. బాలికలకు 18న, బాలురకు 19న పోటీలు నిర్వహించాలన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఆర్చరీ, అథ్లెటిక్స్, చెస్ తదితర క్రీడాంశాల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించాలన్నారు. స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్‌రావు, దమ్మపేట ఏటీడీవో చంద్రమోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటనారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, నెహ్రూ, రామారావు తదితరులు పాల్గొన్నారు.



# శబరి ఉత్సవ రథానికి డోలు, కొమ్ము నృత్యాలతో స్వాగతం

**అశ్వారావుపేట-నవభూమిప్రతినిధి:** మండలంలో వినాయకపురం చిలకల గండి ముత్యాలమ్మ అమ్మవారి సన్నిధికి చేరుకున్న శబరిస్మృతి ఉత్సవ యాత్రారథం. ముత్యాలమ్మ ఆలయం వద్ద జరిగిన శ్రీసీతారామ కళ్యాణం.

భద్రాచలం రామాలయం ఆలయం ఈఒఎల్. రమాదేవి మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య మాత శబరి అని అన్నారు. సంస్కృతీ సంప్రదాయాల మెళవింపే రామాయణ ఇతిహాసం అని చెప్పారు. శ్రీరామ భక్తికి నిదర్శనం శబరి రాముడికి చేసిన సేవ అని కొనియాడారు.

కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నరాల శ్రీను, పలువురు గిరిజన ప్రముఖులు హాజరయ్యారు. శబరి ఉత్సవ రథానికి డోలు, కొమ్ము నృత్యాలతో స్వాగతం పలికారు.

# వైభవంగా వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం

**కామేపల్లి-నవభూమి:** కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో వెంకటే శ్వర స్వామి వారి కల్యాణాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు సురబాక రాజు, సుర బాక రామ్మూర్తిల ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో భక్తులు, గ్రామస్తులు నిర్వ హించారు.అదే విధంగా ఆధ్యాత్మిక భజ న కార్యక్రమాలను కూడా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ప్రదర్శించిన కోలాట ప్రదర్శనలు, బంజారా మహిళల సాంప్ర దాయ నృత్యాలు అందరినీ ఎంతగానో అలరించాయి.ఈ కార్యక్రమంలో పూజారి తాళ్లూరి జనార్దన్ స్వామి, ఆకి హరినాథ్ బాబు, రంగనాయకమ్మ, మన్యం సీతారా మయ్య, సామ వెంకయ్య, మడిగ సందీప్ వరికొల్లు ముత్తయ్య, సుగుణమ్మ, రాసాల గురవమ్మ, అనంత రాములు, పోలేబోయి న శ్రీను, పడిగ రమేష్, అడప రామనా థం,కొండలు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో మోస్తరు వర్షం

**ఖమ్మం-నవభూమి;** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం బుధవారం ఖమ్మం జిల్లాలో కన్పించింది. ఉదయం నుంచి మేఘాలు అలుముకోవడంతో వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో ఖమ్మం నగరంతోపాటు నగర శివారు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. 30 నిమిషాలపాటు నగరంలో చెదురుమదురు వర్షం కురవడంతో ద్విచక్ర వాహనదారులు స్వల్ప ఇబ్బందులకు గురయ్యారు.రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, వైరా మండల కేంద్రంలో మాత్రం సాయంత్రం అర్ధగంటపాటు భారీ వర్షమే కురిసింది. ఇక పెనుబల్లి మండలంలో చిత్రమైన పరిస్థితి కన్పించింది. ఉదయం ఎండ దంచి కొట్టింది. మధ్యాహ్నం మబ్బులు కమ్మాయి. సాయంత్రం వర్షం కురిసింది. అది తగ్గినప్పటి నుంచి ఉక్కపోత మొదలైంది.

## కేయూ దూరవిద్య ప్రవేశాలకు గడువు పొడిగింపు

**ఖమ్మం, నవభూమి, అక్టోబర్ 17 :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్ లైన్ ఎడ్యుకేషన్ (గతంలో ఎస్ డి ఎల్ సి ఈ) లో డిగ్రీ, పీజీ, డిప్లమా కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బిబిఏ, బి ఎస్ సి మ్యాథ్స్, బ్యాచలర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. పిజి కోర్సుల్లో ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, రూరల్ డెవలప్ మెంట్, సోషియాలజీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్ మెంట్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, ఎం కామ్, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎన్విరాన్మెంట్ సైన్స్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, డిప్లమాల తో పాటు మొత్తం 43 కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఆన్లైన్, ఆఫ్ లైన్ లో వాటిని స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫీజు, అర్హతలు తదితర వివరాలకు అధ్యయన కేంద్రం సెల్ నెంబర్ 9849250633, కేయూ దూరవిద్య కేంద్రం వెబ్ సైట్ ఎస్ డి ఎల్ సి ఈ కేయూ. కో.ఇన్ లో సంప్రది%శీ%చాలని గోపి తెలిపారు. యు జి సి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బోర్డ్, ఆన్లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ సంస్థల నిబంధనలు, యూనివర్సిటీ చట్టం మేరకు తరగతులు ఉంటాయని తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన దయాకర్ రెడ్డి



**బోనకల్, నవభూమి, అక్టోబర్ 17:** మండలంలోని పలు గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి చెక్కులను అందించారు. తూటికుంట్ల గ్రామానికి చెందిన ఎం చిట్టిబాబుకు, ముష్టికుంట్ల గ్రామానికి చెందిన మల్లయ్యకు, రామాపురం గ్రామానికి చెందిన జి. లక్ష్మికి, చిన్నబీరవల్లి గ్రామానికి చెందిన విమలమ్మకు ఈ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మినేని కృష్ణ, భాగం నాగేశ్వరరావు, సురేష్, రాంబాబు, మురళీ, కృష్ణ, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, యోహాను, సతీష్ తదితరులు ఉన్నారు.

## గార్లలో ఘనంగా షోయబుల్లాఖాన్ జయంతి వేడుకలు



**గార్ల, నవభూమి, అక్టోబర్ 17:** దివంగత కలం యోధుడు షోయబుల్లాఖాన్ జయంతి వేడుకలు టి యు డబ్ల్యూ జె (ఐజెయు) మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం గార్లలో ఘనంగా నిర్వహించారు. స్థానిక నెహ్రూ సెంటర్ లోని తెలంగాణ అమరవీరుల సంస్మరణ స్తూపం వద్ద షోయబుల్లాఖాన్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గార్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐజెయు మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ కె బుడాన్, జిల్లా సహాయ కార్యదర్శి రావూరి ప్రశాంత్, మండల కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు నేలం శ్రీనివాస్, రూపన్ శంకర్, గార్ల మాజీ ఎంపిపి మాలోతు వెంకట్ లాల్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు కట్టె బోయిన శ్రీనివాస్, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకులు షేక్ యాకుబ్ పాషా, కోలా కుమార్ గౌడ్, బాబు లాల్, సాయి, గార్ల ప్రభుత్వ వైద్యులు రాజ్ కుమార్ జాదవ్, హనుమంతరావు, ఐజెయు సంఘం సభ్యులు వజ్రం నాగేశ్వరరావు, జాన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

### 20న టియుఐసిలో

# ఐఎఫ్టీయు విలీనం

◆ **కార్మిక మిలిటంట్ పోరాటాల కోసం**



**సత్తుపల్లి, నవభూమి, అక్టోబర్ 17 :** టియుఐసిలో ఐఎఫ్టియు అక్టోబర్ 20న టీ యు విలీనం హైదరాబాద్ లో విలీన సభ జరుగుతుందని పిఎస్ డబ్ల్యూ యు రాష్ట్ర నాయకులు అమర్లపూడి శరత్, కె పుల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను గురువారం సింగరేణి కార్మికుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీ యు సి ఐ లో ఐ ఎఫ్ టీ యు విలీన సభను జయప్రదం చేయాలని కోరారు. దేశంలో కార్మిక వర్గం పై ప్రభుత్వాల అణచివేత దోపిడీ పెరుగుతుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు వేగంగా అమలు చేసేందుకు ముందుకు వస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక దోపిడీ, మత ఉన్మాద దృక్పథంతో ఫాసిస్ట్ విధానాలతో మోడీ ప్రభుత్వం శరవేగంగా పావులు కదుపుతుందన్నారు. కార్మికుల్లో ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నదన్నారు. దేశంలో కార్మికుల చట్టాలు సైతం సవరించి యాజమాన్యాలకు అనుకూలంగా మార్చుతుందని విమర్శించారు. బహుళ జాతి కంపెనీలకు సాగిలపడి మొక్కుతున్నదన్నారు. కార్మికుల జీవితాలను చిద్రం చేస్తున్నదన్నారు. ప్రభుత్వరంగం లోని పరిశ్రమలన్నీ ప్రైవేటు వారికీ అప్పచెప్పుతున్నదన్నారు. వాటిలో పనిచేసే పర్మినెంట్ కార్మికులను తొలగిస్తున్నదన్నారు. వి ఆర్ ఎస్ ఇచ్చి ఇంటికి పంపుతున్నారన్నారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికుల సంఖ్యను పెంచుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణ, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, లాంటి సంస్థలను ఆదాని, అంబానీలకు అప్పనంగా ఇవ్వడం ప్రారంభించిందన్నారు. పూర్తిగా కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని విమర్శించారు. దేశంలో 45 కోట్ల మంది కార్మికుల్లో 6 కోట్లు మాత్రమే సంగటిత రంగంలో ఉన్నారన్నారు. మిగలిన 39 కోట్ల కార్మికులు అసంఘటిత రంగంలో ఉన్నారన్నారు. వారికి కనీస వేతనాలు లేవని వన్నారు. కార్మిక వర్గ ఐక్యతకు,సమిష్టి ఉద్యమానికి, దేశ వ్యాప్త సంఘ నిర్మాణానికి ఈ రెండు సంఘాలు ఐక్యమవుతున్నాయ అన్నారు. నిర్దేశించిన లక్ష్యాలతో కొనసాగి దేశవ్యాపిత కార్మికల కోసం అన్వేషించిందన్నారు. 14 రాష్ట్రాలలో సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉన్న కార్మికుల కోసం టియుసి ఐ లో విలీనమై కార్మిక వర్గ పోరాటాలు నిర్వహించబోతు న్నామన్నారు.కార్మిక సంఘం నాయకులు కట్ల ప్రసాద్, గీగా సురేష్, రామకృష్ణ,యనమాల కనకయ్య, వి ప్రసాద్, రత్నాకట్, జయరాజ్, బి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మహనీయుల జీవిత చరిత్రను

# భవిష్యత్ తరాలకు అందించాలి

◆ **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ**

◆ **మహర్షి శ్రీ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అదనపు కలెక్టర్**







**ఖమ్మం, నవభూమి బ్యూరో,అక్టోబర్17:** ప్రతి సందర్భంలో భవిష్యత్తు తరాలకు మహనీయుల జీవిత చరిత్రను తెలియజేసి వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఆదికవి, రామాయణ గ్రంథ రచయిత మహర్షి శ్రీ వాల్మీకి జయంతి సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రామాయణ గ్రంథాన్ని రచించి అనేక విలువలను సమాజానికి అందించారని, రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని, మహాకవి వాల్మీకి జయంతిని అధికారికంగా పండుగ వాతావరణంలో జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు. అనంతరం వక్తలు మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ, కలెక్టరేట్ వివిధ సెక్షన్ ల సూపరింటెండెంట్ లు, సిబ్బంది, బి.సి. సంఘం నాయకులు జక్కుల వెంకట రమణ, షకీన, వాల్మీకి సంఘం నాయకులు కె. ఉపేందర్ రావు, డి. శ్రీనివాస్ రావు, ఎం. నరసింహా రావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు జి. వెంకట రామయ్య, కార్యదర్శి గజవెల్లి లక్ష్మీ వరప్రసాద్, ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగబోయిన పుల్లా రావు, ప్రధాన కార్యదర్శి కేతనబోయిన నాగేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణాలకు స్థలాలు

**భద్రాద్రి కొత్తగూడెం-నవభూమి :** త్వరలోనే జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, ఐసీడీఎస్ కార్యాలయాల భవన నిర్మాణాలకు స్థలాలు కేటాయిస్తామని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ చేపడుతున్న ఐసీడీఎస్ కార్యకలాపాలు, చైల్డ్ ప్రొటెక్షన్, అడాప్షన్, చైల్డ్ హెల్ప్లైన్పై బుధవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలు, స్థలం వివరాలు అందజేయాలని సీడీపీవోలను ఆదేశించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల వంటి కనీస వసతులు కల్పించాలని సూచించారు. లోప పోషణకు గురైన పిల్లలను సాధారణ స్థితికి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.

## బీటీ రోడ్ల అభివృద్ధి కొరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 19.70 కోట్ల రూపాయల నిధులు మంజూరు

### హర్షం వ్యక్తం చేస్తున్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు



**Madhira CRR Sanctions**

| S. No. | District | Assembly Constituency | Mandal | Name of the Road | Length (in Km) | Estimate Cost (Rs. Lakhs) |
|---|---|---|---|---|---|---|
| 1 | Khammam | Madhira | Bonakal | BT R/F Garlapadu to Ramapuram PR Road to Patharlapadu to Govindapuram PR Road along Bonakal Branch Canal | 3.00 | 670.00 |
| 2 | Khammam | Madhira | Bonakal | BT R/F Govindapuram to Patharlapadu Upto Bonakal Branch Canal | 2.20 | 460.00 |
| 3 | Khammam | Madhira | Bonakal | BT R/F Govindapuram to International School at Thutikuntla Road | 1.10 | 260.00 |
| 4 | Khammam | Madhira | Bonakal | BT R/F Govindapuram Patharlapadu Road to Integrated Residential School | 1.00 | 230.00 |
| 5 | Khammam | Madhira | Bonakal | Govindpuram to Vallapuram | 3.50 | 340.00 |
| 6 | Khammam | Madhira | Chinthakani | BT R/F Nagulavancha Thirlapuram R&B road to Chintakani via Tummalammacheruvu | 5.00 | 540.00 |
| | | | | | 15.80 | 2500.00 |

**బోనకల్, నవభూమి, అక్టోబర్ 17**: గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు, మధిర శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశాల కృషి చేస్తున్న విషయం తెలిసిందే. అందుకు తాను పదవి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి భారీగా నిధులు సమకూరుస్తూ అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. తాజాగా మండలంలో బీటీ రోడ్ల అభివృద్ధి కోసం 19.70 కోట్ల రూపాయలు కేటాయిస్తూ జీవో జారీ చేశారు. ప్రత్యేక నిధులు కేటాయించడం పట్ల పిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు, మాజీ జెడ్పిటిసి సభ్యులు మోదుగు సుధీర్ బాబు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలకోట సొసైటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావులు, మాజీ సర్పంచ్ ఎర్రం శెట్టి సుబ్బారావు లు ఉప ముఖ్యమంత్రి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వేట వేంకటేశ్వర స్వామికి బంగారు హారం బహుకరణ

**గార్ల, నవభూమి, అక్టోబర్ 17:** గార్ల శ్రీ వేట వేంకటేశ్వర స్వామికి గార్లకు చెందిన పరుచూరి కుటుంబ రావు – కనక లక్ష్మి దంపతులు గురువారం బంగారు హారాన్ని బహుకరించారు. స్వామి వారి కరుణ కటాక్షం తమపై కలగాలని స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సుమారు లక్ష యాభై వేల రూపాయల విలువైన బంగారు హారం ను ఆలయ పండితులకు అందించారు.



# కేటీఆర్‌కు మతి భ్రమించింది

- ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం
- ప్రజా శ్రేయస్సే ప్రథమ కర్తవ్యం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు మానుకోవాలి
- పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్



**ఖమ్మం నవభూమి, అక్టోబర్ 18 :** కేటీఆర్ మానసిక పరిస్థితి సరిగలేదని, ఆయన అధికార అహంకారం,డ్రగ్స్ నుండి బయటపడటానికి విత్ డ్రాల్ తో ఇబ్బంది పడుతున్నాడని డ్రగ్స్ ఉపయోగం కోసమే కేటీఆర్ అమెరికా పర్యటన. నాడు మా ముఖ్యమంత్రి మిమ్మలని వైట్ చాలెంజ్ కి సవాల్ చేస్తే ఎందుకు రాలేదు?గతంలో మీరు అధికారంలో ఉన్నప్పుడు మా ప్రభుత్వానికి బుడిబుడి అడుగులేస్తోంది,ఇప్పుడే బారసాల అయింది అని చెప్పిన మీరు 10నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శలు చేసే కేటీఆర్ పదేళ్ల మీపాలన తాలూకు ఆర్థిక విధ్వంసం నుండి రాష్ట్రాన్ని బయటవేయడానికి ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి అహర్నిశలు కష్టపడి పని చేస్తున్నారని,కాంగ్రెస్ వచ్చాకనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది మీకు కనిపించడం లేదా?మహిళలకి ఉచిత బస్సు,గ్యాస్ సిలెండర్,పేదల ఇండ్లకు ఉచిత విద్యుత్ కనిపించడంలేదా?అనేక ఉద్యోగ నియామకాలు చేపట్టడం జరుగుతుంది మీకాలం లో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు కానీ మొన్ననే 11 వేల ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడం జరిగింది,కేసుల గురుంచి కొంత మంది నాయకులు మాట్లాడుతున్నారు మీ ప్రభుత్వంలో బయటకు రావడానికి ప్రజలు భయపడ్డారు మీరు అనేక మంది మీద అక్రమ కేసులు పెట్టిన చరిత్ర మీది,మా ప్రజా ప్రభుత్వం వచ్చినాక ఒక్క అక్రమ కేస్ కూడా నమోదు కాలేదని అన్నారు.పొట్ల నాగేశ్వర రావు మాజీ మీజ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కేవలం పది నెలల ఈ పది నెలల కాలంలోనే ప్రజలకు కావాల్సిన అనేక సంక్షేమ పథకాలు చేపట్టడం జరుగుతున్నదని,గత ప్రభుత్వం చేసిన అప్పుల క్రింద 56 వేల కోట్లు అప్పు తీర్చడమే కాకుండా సమాంతరంగా సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారు.కెసిఆర్ బయటకు రాడు కేటీఆర్,హరీష్ లు ప్రభుత్వం మీద పసలేని విమర్శలు చేస్తున్నారు.గత %దీ=ూ% ప్రభుత్వంలో నాయకులు ఢిల్లీలో మోడీ కాళ్ళకి మొక్కి %ఖీ=దీవీ% పరిధి దాటి ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసిన వీరు నేడు ప్రజా రంజకంగా సాకుతున్న పాలన మీద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉన్నదని,గత ప్రభుత్వం మేము ఖమ్మం లో ఒక బంక్ ముందు పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలను నిరసనగా బంక్ ముందు ధర్నా చేస్తే నాటి నేత భట్టి విక్రమార్క గారి మీద,నా మీద,జిల్లా అధ్యక్షులు మీద కేసులు పెట్టిన మీరు కేసులు గురుంచి చెపుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది... ఈ ప్రజా ప్రభుత్వంలో ఎవరి మీద అక్రమ కేసులు నమోదు కాలేదు.ఇక నైనా కేటీఆర్,కెసిఆర్,హరీష్ లు బుద్ధి మార్చుకొని ప్రభుత్వానికి సహాయంగా ఉంటూ నిర్మాణాత్మక సలహాలు సూచనలు ఇవ్వాలి అని హితవు పలికారు.బాలసాని లక్ష్మీనారాయణ మాజీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే దేశంలో మరే ప్రభుత్వం ఇవ్వని విధంగా నెల రోజుల్లోనే రైతులకు 18 వేల కోట్ల రుణ మాఫీ చేసింది .మరో 13 వేల కోట్లు రైతు రుణ మాఫీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని,కొన్ని కారణాల వలన రుణ మాఫీ ఆలస్యం అవుతుంది కానీ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో చిత్తశుద్ధిగా ఉన్నది 18 వేల కోట్లు చేసాం మరో 13వేల కోట్లు చేస్తాం అని స్పష్టంగా చెపుతుంది.గతంలో వరదలు వచ్చినప్పుడు గత ప్రభుత్వం ప్రకటనలకు మాత్రమే వరద సహాయం ప్రకటించేది..కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 16500 వేసింది వీరిలో కూడా కొన్ని టెక్నికల్ ప్రోబ్లం వలన ఆగినవి ఇవి కూడా త్వరలో వేస్తాం అని చెపుతున్నామని అన్నారు.నల్లమల్ల వేంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతుల కోసం రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు.

ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతులకు రుణమాఫీ చేసింది త్వరలోనే పూర్తిస్థాయిలో అందరికీ రుణమాఫీ అందుతుందని అన్నారు.గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగానే రైతు భరోసా లేట్ అయ్యింది..త్వరలోనే పెంచి రైతు భరోసా ప్రభుత్వం వేస్తుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మైనారిటీ,%ాజ% సెల్ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ అబ్దుల్ రషీద్, నగర కాంగ్రెస్ నాయకులు సత్యాల వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఆరు హామీలను అమలు చేయండి

- రైతు భరోసాతో పాటు కూలీ భరోసాను ఇవ్వండి: బికెఎంయు నాయకులు తాటి

**ఖమ్మంనగరం, నవభూమి,అక్టోబర్17:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్బంగా ఇచ్చిన ఆరు హామీలను తక్షణం అమలు చేయాలని భారత్ ఖేత్ ముజూర్ యూనియన్ (బికెఎంయు) జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలలో ఉచిత బస్సు మాత్రం పూర్తి స్థాయిలో అమలవుతుందని మిగిలిన గ్యారెంటీలపై ప్రభుత్వం దృష్టిసారించాలని ఆయన కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సమావేశం గురువారం జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్ జరిగింది. సమావేశంలో తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద మహిళా కూలీలకు ఏడాదికి రూ. 19వేలు, వృద్ధులకు ,దివ్యాంగులకు నెలవారి పించన్ ఇస్తామని హామీ ఇచ్చారని హామీని నిలబెట్టుకోవాలన్నారు. నిరుపేదలకు ఎటువంటి ఆంక్షలు లేకుండా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ఇతరత్రా ఖర్చులలో పూర్తిగా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కూలీల పరిస్థితి ఇబ్బందికరంగా మారిందన్నారు. వ్యవసాయం సరైన రీతిలో లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఆర్థిక చేయూతనివ్వాలని ఆయన కోరారు. రైతులకు రైతు భరోసా అనులు చేస్తామని ప్రకటించారని,అదే రీతిలో కూలీలకు ప్రభుత్వం అండగా నిలిచి కూలీ భరోసాను ప్రకటించాలని తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి త్వరలో పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బికెఎంయు నాయకులు పగిళ్ల వీరభద్రం, రామలక్ష్మి, పిల్లల రాంబాబు, భూక్యా సేనియా తదితరులు పాల్గొన్నారు.



## ప్రమోషన్ పొందిన టీచర్లకి పూర్తి జీతం చెల్లించాలి



**చర్ల అక్టోబర్ 17 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో మినీ టీచర్ నుండి మెయిన్ టీచర్ గా ప్రమోషన్ పొందిన అంగన్వాడీ టీచర్లకు పూర్తి జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చర్ల ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా సందర్భంగా ప్రాజెక్ట్ సిఐటియు నాయకులు స్వరూప మాట్లాడుతూ మినీ టీచర్ల నుంచి మెయిన్ టీచర్లుగా ప్రమోషన్ ఇచ్చినప్పటికీ ఒక నెల పూర్తి జీతం ఒక నెల సగం జీవితం చెల్లిస్తూ వర్కర్లను తీవ్ర మనోవేదనకు ప్రభుత్వం గురి చేస్తుందని పేర్కొన్నారు. గత ఐదు నెలలుగా సగం జీవితం చెల్లిస్తూ ప్రభుత్వం ప్రమోషన్ పొందిన టీచర్లను మోసగిస్తుందని పేర్కొన్నారు పోరాడిసాధించుకున్న హక్కుల్ని సైతం ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లు హెల్పర్లకు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించకుండా అంగన్వాడీ టీచర్లు హెల్పర్లను ప్రభుత్వం ఇబ్బందులపాలుజేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంప్రమ్షెషన్ పొందిన వారందరికీ ప్రతి నెల పూర్తి జీతం చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. గత ఐదు నెలలుగా పెండింగ్ లో ఉంచిన సగం జీతాన్ని కూడా వెంటనే చెల్లించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు డిమాండ్ చేసింది. సమస్యను పరిష్కారం చేయాలని మంత్రులకు ఎన్నిసార్లు విన్నవించిన ప్రభుత్వం తీరు దున్నపోతు మీద వాన కురిసినట్టే ఉందని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన ఎంత పత్రాన్ని సిడిపిఓ చైతన్యకు అందజేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ప్రాజెక్ట్ నాయకురాలు ఎన్.రాణి, పి.రాణి, నాగమణి, రమ్య, నర్సమ్మ, జ్యోష్న, భారతి, రాజేశ్వరి, దర్మాదేవి తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ వేట వెంకటేశ్వరుడి కల్యాణం

**గార్ల, నవభూమి, అక్టోబర్ 17:** కోరిన వారి కొంగు బంగారంగా వాసికెక్కిన గార్ల శ్రీ వేట వెంకటేశ్వర స్వామి కల్యాణం గురువారం గార్ల మండలం మర్రిగూడెం సమీపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏటా ఆశ్వీయుజ మాసంలో శ్రీ వేట వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ వస్తుంది. తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి వేట మార్గం ఈ ప్రాంతానికి వచ్చి మర్రి గూడెం సమీపంలో ప్రతిష్ఠ జరిగినట్లు నానుడి. శ్రీదేవి- భూదేవి సమేతుడైన శ్రీ వేట వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక అలంకరణ చేసిన వాహనం పై ప్రతిష్ఠింపజేసి మేళతాళాల మధ్య ఆలయ పరిసరాల్లో ఊరేగించి ఆలయం వెలుపల ఉన్న కల్యాణ మండపం వరకు తీసుకొచ్చి వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య కల్యాణ తంతు జరిపారు. తలంబ్రాలను డోర్నకల్ సమీపంలోని అమ్మ పాలెం చెందిన మల్లెం వంశస్థులు తీసుకొని రాగా పీటలపై అయి ప్రాంతాలకు చెందిన పలువురు దంపతులు ఆసీనులై కన్యాదానం చేశారు. గార్ల మండలం పరిధిలోని ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు మహబూబాబాద్, ఖమ్మం, హైదరాబాద్, వరంగల్,తదితర జిల్లాలను భక్తులు తరలి వచ్చి కల్యాణాన్ని వీక్షించడం తో తమ కోరిన కోర్కెలు తీర్చాలని మొక్కులు చెల్లించుకున్నారు.



### తరుణ్, శ్రియా శరణ్ సందడి చేసిన

# జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2024 పార్ట్-2


◆ ఈ శనివారం సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో




**ఖమ్మం, 17 అక్టోబర్ (నవభూమి) :** తెలుగు ప్రేక్షకులకు నిరంతరం వినోదాన్ని అందించే ఛానల్ జీ తెలుగు. నటీనటులను ప్రోత్సహించేం దుకు ప్రతి సంవత్సరం మాదిరిగానే 2024 సంవత్సరానికిగానూ ప్రతిష్టాత్మక జీ తెలుగు కుటుంబం అవార్డ్సు ఘనంగా నిర్వహించింది. టాలీవుడ్ ప్రముఖులు, జీ తెలుగు తారల సందడితో కోలాహలంగా జరిగిన ఈ కార్యక్రమం మొదటి భాగం ఇప్పటికే ప్రసారం కాగా, రెండో భాగాన్ని ప్రసారం చేసేందుకు సిద్ధమైంది. ఈ మెగా ఈవెంట్ పార్ట్-2ను ఈ ఆదివారం మీముందుకు తెచ్చేందుకు సిద్ధమైంది. అలరించే ప్రదర్శనలు, హృదయాన్ని హత్తుకునే క్షణాలు, మరపురాని అనుభవాలతో తెలుగు టెలివిజన్ స్ఫూర్తిని ప్రతిబింబించే జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్-2 అక్టోబర్ 19 సాయంత్రం 6 గంటలకు ప్రసారం కానుంది. తెలుగు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్ 2 మరోసారి వారిని అలరించేందుకు సిద్ధమైంది. ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, వర్షిణి ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఆషిక, సౌందర్యల అద్భుతమైన ప్రదర్శనతో అన్ని సీరియల్ కుటుంబాల ప్రత్యేక ఎంట్రీతో ఘనంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మేఘసందేశం సీరియల్ నటి భూమి నృత్య ప్రదర్శన ఈవెంట్కి మరింత సంప్రదాయ కళను తీసుకొచ్చింది. యాంకర్వర్షిణి జీ హీరోలందరితో కలిసి అద్భుతమైన మాస్ డాన్స్తో వీక్షకుల్లో ఉత్సాహంనింపింది. టాలీవుడ్ లవ్లీ పెయిర్ తరుణ్, శ్రియశరణ్ ఎంట్రీ షో మరింత ఆహ్లాదంగా సాగింది. శ్రియ సినిమాల్లోని ప్రసిద్ధిగాంచినసన్నివేశాలను డ్రామా జూనియర్స్ పిల్లలు రీక్రియేట్ చేసి నవ్వులు పూయించారు. తరుణ్తో జీ తెలుగు తారల అల్లరి, శ్రియ డాన్స్పెర్ఫామెన్స్ షోకి హైలెట్గా నిలిచాయి. ఉత్తేజకరమైన, వినోదభరితమైన, భావోద్వేగభరితమైన ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మీప్రియమైన తారలు వారి అసాధారణ ప్రతిభ,సృజనాత్మకత, అంకితభావాన్ని ప్రశంసిస్తూ ప్రతిష్ఠాత్మక జీకుటుంబం అవార్డులు 2024 అందుకున్నక్షణాల్లో జీ తెలుగు వేదికగా మీరూ భాగంకండి

## ఘనంగా షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం

**జూలురుపాడు,అక్టోబర్ 17 (నవభూమి ప్రతినిధి) :**మండల కేంద్రంలోని దత్త నగర్ లో వేంచేసిన శ్రీ శిరిడి సాయిబాబా మందిర 23వ వార్షికోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మంగళ తోరణాలంకరణతో పూజాధికాలను నిర్వహించారు. 2001 సంవత్సరంలో సాయి బాబా మందిర ప్రతిష్ట కార్య క్రమం చేశారు. అనేక మంది ప్రముఖులు,ప్రజల సహకారంతో మందిర నిర్మాణంలో లేళ్ల వెంకటరెడ్డి ప్రముఖ పాత్ర పోషించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి రోజు నిత్య పూజా కార్యక్రమాలు ప్రతి గురువారం జరిగే అన్నదాన కార్యక్రమం లో పలువురు భక్తులు పాల్గొని బాబా ఆశీస్సులు పొందుతున్నారు. గత ఇరవై మూడు సంవత్సరాలుగా వెంకట రెడ్డి సాయిబాబా మందిరానికి ఇతోధికంగా సేవలు అందిస్తూ బాబా సేవలో తరిస్తున్నారు. గురువారం వార్షిక మహోత్సవాన్ని పురస్కరించుకొని వెంకట రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



## వరి వెదజల్లే పద్ధతిపై రైతులకు అవగాహన

**కల్లూరు, నవభూమి, అక్టోబర్ 17::** స్థానిక మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో గురువారం రైతులకు వరి వెదజల్లే పద్ధతిపై ఉగాది కల్పించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో భారతీయ వరి పరిశోదన సంస్థ ఆధ్వర్యంలో విత్తే పద్ధతిలో వరి సాగు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, భారతీయ వరి పరిశోదన సంస్థ కీ టక విభాగ టెక్నికల్ ఆఫీసర్ టి .వెంకయ్య, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మండల వ్యసాయాధికారి రూప మాట్లడుతూ ప్రస్తుత పరిస్థితులలో వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, తరిగిపోతున్న భూగర్భ నీటి వనరులు, వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ సమస్య, కూలీల కొరత, వ్యవసాయ ఉత్పాదకాల ధరలు బాగా పెరుగుట వల్లన వరి వ్యవసాయము గిట్టుబాటుకాక, వ్యవసాయ ఖర్చును తగ్గించుటకు రైతులకు నేరుగా విత్తే వరిసాగు పై అవగాహన కల్పించడం జరిగింది, వరవరిసాగు లాభసాటిగా చేసుకోవటానికి యాంత్రీకరణ చాలా అవసరం. పొలం తయారీ, విత్తడం, ఎరువులు వేయడం, కలుపు మందులు, క్రిమిసంహారక మందులు, పిచికారీ చేయటం, వరికోత, కట్టడం, నూర్పిడి, ఆరబెట్టడం వంటి అన్ని పనులకు యంత్రములు మరియు డ్రోన్స్ అందుబాటులో ఉన్నవి. ఇవి ఉపయోగించి సాగుఖర్చును తగ్గించుకోవచ్చు. నాట్ల వరిసాగు ఖర్చు కంటే నేరుగా విత్తే వరిసాగుకు హెక్టారుకు రూ. 8000 నుంచి రూ.10000 వరకు ఖర్చు తగ్గుతుందనీ తెలిపారు. అలాగే డ్రోన్ టెక్నాలజీ తో సుమారు 50 ఎకరాల వరి లో ఉల్లికోడు మరియు కాండం తొలుచు పురుగు నియత్రణకు ఉచితం స్ప్రే చేయడం జరిగింది. ఈ కార్యక్రమంల, శ్రీను, యంగ్ ప్రొఫెషనల్ కె.అజయ్ , డ్రోన్ ఆపరేటర్ సంతోష్ రెడ్డి , దొరవయ్య , హుస్సేన్, నాగరాజు, బాల కృష్ణ, కిరణ్, వెంకట్, అప్పారావు పాల్గొన్నారు.



# 21న ఖమ్మంలో పీడీఎస్యూ అర్ధ శతాబ్ద ఉత్సవ విద్యార్థి ప్రదర్శన,సదస్సును జయప్రదం చేయండి




**ఖమ్మంనగరం, నవభూమి,అక్టోబర్17 :** ఈనెల అక్టోబర్ 21న ఖమ్మంలో మరియు అక్టోబర్ 24న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరగబోయే పి డి ఎస్ యు అర్థ శతాబ్ద ఉత్సవ సభలను జయప్రదం చేయవలసిందిగా,పి.డి.ఎస్.యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వక్తలు కోరారు. ఈ సమావేశంలో పిడీఎస్యూ పూర్వ నాయకులు రాష్ట్ర నాయకులు టి వేణు ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడుతూ త్యాగాల పునాదులతో నెత్తుటి రహదారులలో ఏర్పడిన పిడిఎస్యు త్యాగాల చరిత్రను ఉద్యమ గమనాన్ని సమక్షిస్తూ రేపటి కర్తవ్యాన్ని సమాజం పట్ల బాధ్యతను గుర్తు చేస్తూ పి డి ఎస్ యు అర్థ శతాబ్ద ఉత్సవ సభలు నిర్వహిస్తున్నదని,ఈ సభలను జయప్రదం చేయవలసిందిగా ప్రజలను ప్రజాస్వామ్యవాదులను,మేధావులను,ప్రగతిశీల శక్తులను, విప్లవ అభిమానులను, విద్యార్థులను మరియు కళాశాల యాజమాన్యాలను కోరుతున్నామన్నారు. ఈ సభకు మాజీ పి డి ఎస్ యు రాష్ట్ర నాయకులు ప్రస్తుత కేంద్ర కమిటీ నాయకులు దివాకర్ ముఖ్య వక్తగా భోపాల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బుర్ర రమేష్, టి శ్రీనివాస్, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని వారు ప్రస్తుత విద్యార్థులకు పూర్వ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యూ పూర్వ విద్యార్థి నాయకులు వెంకన్న, గొరపాటి రమేష్, ఎస్కే సుభాన్, పాముల మోహన్ రావు, ప్రస్తుత పిడిఎస్యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ క్రాంతి మస్తాన్, జిల్లా నాయకులు సాగర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# జూలురుపాడు మండల విద్యాశాఖ అధికారిగా బాణోత్ జుంకీలాల్

**జూలూరుపాడు,అక్టోబర్ 17 (నవభూమి ప్రతినిధి) :** ప్రభుత్వం ఇటీవల జిల్లాలోని అన్ని మండలాలకు పూర్తి స్థాయి విద్యాశాఖ అధికారులను నియమించింది.దానిలో బాగంగా మండలానికి పడమట నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు గా పనిచేస్తున్న బాణోత్ జుంకీ లాల్ ను నియమించారు. గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొత్తగూడెం తో పాటు మిగతా మండలాలకు ఎం ఈ ఓ పనిచేసిన అనుభవం వుంది.నూతనంగా భాద్యతలు తీసుకున్న జుంకిలాల్ ను తెలంగాణ రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయ సంఘ బాధ్యులు మర్యాద పూర్వకంగా కలుసుకొని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ బాధ్యులు,ఉపాధ్యాయులు ధరావత్ భాస్కర్, సీతారాములు,నరసింహారావు,స్వరూపరాణి, నేతాజీ,జైత్రాం,హనుమాన్ పాల్గొన్నారు.



# అనాధలను ఆశ్రమంలో చేర్పించండి

## కలెక్టర్ జితేష్ వి. పాటిల్





**కొత్తగూడెం (భద్రాచలం) అక్టోబర్ 17,నవభూమి ప్రతినిధి :** హై జిల్లాలోని అనాథగా బతుకుతున్న చిన్నపిల్లలకు అంగవైకల్యం ఉన్న, చెవిటి మూగవారు ఉన్నా వారికి భద్రాచలంలోని అనాథ పిల్లల ఆశ్రమంలో చేర్పించి అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. గురువారం భద్రాచలంలోని అనాథ పిల్లల శిశు గృహం ఆయన సందర్శించారు. ఆశ్రమంలోని పరిసరాలను పిల్లలకు అందుతున్న ఏర్పాట్ల గురించి సంబంధిత డీ డబ్ల్యూఓని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ పిల్లలను పెంచి పోషించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అనాథ ఆశ్రమంలో చేరే పిల్లలకు వారు అనాథలం అన్న ఆలోచన వారి మనసులో రాకుండా ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది వారికి ప్రేమానురాగాలు చూపించాలని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎక్కడైనా రోడ్లమీద తిరుగుతున్న అనాథ పిల్లలను గుర్తించి సంబంధిత అధికారులు తప్పనిసరిగా అనాథ పిల్లల ఆశ్రమంలో చేర్పించాలని అన్నారు. అనాథాశ్రమంలో చేర్పించినంతమాత్రాన వారి బాధ్యత తీరలేదని వారికి ఇక్కడ అన్ని సౌకర్యాలు అందుతున్నది లేనిది అప్పుడప్పుడు గమనిస్తూ ఉండాలని అన్నారు. అనంతరం పిల్లలతో సరదాగా మాటా మంచి మాట్లాడి అనాథలం అనే భావన మీ మనసులో రావద్దని మీకు కావలసింది ఇక్కడ సిబ్బందిని అడిగి తీసుకోవాలని శ్రద్ధగా చదువుకొని ప్రయోజకులు కావాలని అన్నారు. ఆర్డీవో కార్యాలయం పక్కనే ఉన్నందున సంబంధిత ఆర్డీవో వారానికి రెండు మూడు సార్లు అయినా అనాథ పిల్లల ఆశ్రమాన్ని సందర్శించి పిల్లలకు అందుతున్న సౌకర్యాల గురించి సిబ్బందికి సూచనలు ఇస్తూ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, డీసీపీవో హరి కుమారి, డి డబ్ల్యు ఓ స్వప్న కుమారి లేనిన, ఆర్ ఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తుకి బానిస కావద్దు

## కలెక్టర్ జితేష్ వి పాటిల్

**కొత్తగూడెం అక్టోబర్ 17 నవభూమి ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రారంభించిన యాంటీ డ్రగ్స్ కాంపైన్ లో భాగంగా గురువారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ కార్యాలయం లో పోస్టర్ లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ చాట్లపల్లి పురుషోత్తం, స్థానిక యువత పాల్గొన్నారు.




# శ్రీ మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



**కొత్తగూడెం అక్టోబర్ 17 నవభూమి ప్రతినిది,:** సింగరేణి హెడ్డాఫీస్ లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు . జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్సి పి.సామ్యూల్ సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా డైరక్టర్ (ఈ అండ్ ఎం ఆపరేషన్స్) డి.సత్యనారాయణ రావు హాజరై వాల్మీకి చిత్ర పటానికి శాఖాధిపతులు, అధికారులు, ఉద్యోగులతో కలసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ, సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా అన్నీ ఏరియాలలో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జరుపుకోవటం చాలా సంతోషం అన్నారు . జీవితం లో మార్పు అనేది సహజం అని బోయ వాడైన రత్నాకరుడు (వాల్మీకి) దారి దోపిడీలు చేసే స్థాయి నుండి రామాయణ ఇతిహాసం రచించి వాల్మీకి మహర్షిగా మార్పు చెందారన్నారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ తమలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి, చెడుని వదిలి వ్యక్తి గత జీవితం లో మరియు మన వృత్తి లో కూడా అనుకున్న స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేట్ సిఎంఓఏఐ అధ్యక్షుడు ఎం.విజయ భాస్కర్ రెడ్డి, బిసి వెల్ఫేర్ అసోసియేషన్ లైజనింగ్ ఆఫీసర్ హరి శంకర్, జిఎం(సిపిపి) ఏ.మనోహర్, జిఎం(హెచ్ఆర్డి) వి.కృష్ణయ్య, జిఎం(ఈ%డ%ఎం) యూజి మైన్స్ వై.రఘు రామి రెడ్డి, జిఎం(వెల్ఫేర్ అండ్ ఆర్సి) పి.సామ్యూల్ సుధాకర్, జిఎం టెక్నికల్ సర్వీస్ సోమయాజులు వి రామ మూర్తి, జిఎం(ఎఫ్ అండ్ ఏ) ఎం.సుబ్బా రావు, జిఎం(పర్సనల్) ఈఈ అండ్ సిఎస్ఆర్ బెనెడిట్ట్ నికోలస్, కార్పోరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు అధికారులు, ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రంథాలయానికి సీలింగ్ ఫ్యాన్స్, కుర్చీలు వితరణ

**భద్రాచలం అక్టోబర్ 17 నవభూమి ప్రతినిది,:** భద్రాచలం పట్టణంలో ఉన్నటువంటి గ్రంథాలయంలో ఫ్యాన్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నటువంటి విషయాన్ని జానీ లైబ్రేరియన్ సోమశేఖర్ కు తెలియజేయగా స్థానిక జీవన్ హాస్పటల్ చల్లగుల్ల నాగేశ్వరరావు రెండు సీలింగ్ ఫ్యాన్లు, రెండు స్టడీ చైర్స్ ఈరోజు సిహెచ్. సంపత్ కుమార్ ఔషధ తనిఖీ అధికారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారి చేతుల మీదగా లైబ్రేరియన్ జానీ కి గ్రంథాలయం నందు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సోమశేఖర్ పరిమి భద్రాచలం అధ్యక్షులు రేపాక కేశవ్ మరియు పట్టణ కెమిస్ట్ పాల్గొన్నారు





# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు





**కొత్తగూడెం అక్టోబర్ 17 నవభూమి ప్రతినిధి**: ఐడిఓసి లో గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణం రచించి ప్రపంచానికి తెలియజేసిన ఆదికవి వాల్మీకి మహర్షి అంటూ గుర్తు చేశారు. ప్రపంచం ఉన్నంతవరకు రామాయణం, వాల్మీకి చరిత్ర ఉంటుందని, ఇతిహాసాల్లో మొదటిది రామాయణం,పెద్దది మహాభారతం అని అన్నారు. అలాంటి రామాయణాన్ని రచించినది ఒక బోయ కులానికి చెందిన చోరుడు అయినా వాల్మీకి, ఈయన ఇచ్చిన స్ఫూర్తితో అనేక మంది రచయితలుగా కవులుగా మారారు అని అన్నారు. ఇతిహాసాల్లోని సారాంశాలను ఈ తరం పిల్లలకు అర్థమయ్యే విధంగా తెలియచెప్పే బాధ్యత మనందరి మీద ఉందని అన్నారు. ఇలాంటి గొప్ప వారి చరిత్ర గురించి తెలుసుకోవడం నేటి తరాలకు చాలా అవసరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఇందిరా, కలెక్టరేట్ పరిపాలన అధికారి రమాదేవి, బీసీ సంఘ నాయకులు మురికి వెంకన్న, భోగా నందకిషోర్, ఉలవల రాములు, గట్టేశం, కోడుమూరు సత్యనారాయణ, గుర్రం శ్రీనివాసరావు, చల్లా శివ, చెప్పా శ్రీనివాస్, చెప్పా వెంకటేశ్వరరావు, గొలుసు శ్రీనివాస్ రావు మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జమలాపురం పాఠశాలకు కంప్యూటర్,స్కానర్ ప్రింటర్ బహుకరణ

**ఎర్రుపాలెం,నవభూమి, అక్టోబర్ 17 :** మండల పరిధిలోని జమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జమలాపురం గ్రామానికి చెందిన కాకమాను లీలకృష్ణ,లక్ష్మీ కుమారి దంపతుల కుమార్తె కాకమాను అంబిక గురువారం కంప్యూటర్ ను బహుకరించారు.దాత అంబిక జమలాపురం పాఠశాల పూర్వ విద్యార్థిని.ఈమె బెంగళూరులో సాఫ్ట్ వేరు ఉద్యోగం చేస్తూ తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో పాలుపంచు కోవాలనే ఆలోచనతో కంప్యూటర్ బహుక రించారు.జమలాపురం ఉన్నత పాఠశాలలో గతంలో ప్రధానోపాధ్యా యులుగా పనిచేసిన రామబ్రాహ్మ చారి పాఠశాలకు స్కానర్ మరియు ప్రింటర్ ను బహుకరించారు.జమలా పురం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగులంచ జ్యోతిశ్రీ విజ్ఞప్తి మేరకు స్పందించి కంప్యూటర్ ను అందించిన అంబికను,స్కానర్ కమ్ ప్రింటర్ ను పాఠశాలకు బహుకరించిన రామ బ్రహ్మచారి లకు ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిశ్రీ,ఉపాధ్యాయులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కాకమాను లీలకృష్ణ మాట్లాడుతూ జమలా పురం గ్రామానికి చెందిన ఖమ్మం కెఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు,నిర్మల కుమారి దంపతులను ఆదర్శంగా తీసుకొని గ్రామ పాఠశాల అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు,విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరగాలి: సిపిఎం




**జూలురుపాడు,అక్టోబర్ 17 (నవభూమి ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు లో ఎంపిక చేయనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వాలని సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు వల్లమల్ల చంద్రరావు అన్నారు. గురువారం గుండే పూడి శాఖ ముఖ్యల సమావేశంలో మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా అర్హులైన వారిని ఎంపిక చేయాలని అధికార పార్టీ జోక్యం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచనల ద్వారా ఏడుగురు సభ్యుల ఇందిరమ్మ కమిటీలను యస్సీ,యస్టీ,బిసి వర్గాలతో పాటు మిగతా సభ్యులను నిష్పక్ష పాతంగా ఏర్పాటు చేయాలని కోరారు. కమిటీ గ్రామ అభివృధికి పాటు పడేలా వుండాలి తప్ప అధికార పార్టీ కమిటీలు గా వుండొద్దని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరిగితే ప్రజలను చైతన్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.ఈ సమావేశం లో మండల కమిటీ సభ్యులు భానోత్ మధు,గడిదేశీ కనకరత్నం,ఇల్లంగి సీతారాములు, ఇస్లావత్ భద్రు,జమ్మి యస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థి ప్రాణానికి సహాయం వెలకట్టలేనిది



**అశ్వరావుపేట టౌన్ అక్టోబర్ 17 నవభూమి :** అశ్వారావుపేట పేరాయిగూడెం పంచాయితి నెహ్రూనగర్‌కు చెందిన 16 ఏళ్ల మోపేటి చరణ్, ప్రతిభావంతుడైన విద్యార్థి. సత్తుపల్లిలోని తేజ ఒకేషనల్ కాలేజ్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్యలతో అతను తీవ్రంగా బాధపడుతున్నాడురక్త తగ్గడం, తెల్ల రక్త కణాలు విరిగిపోవడం, గుండెకు చిల్లు వంటి సమస్యలు అతని ఆరోగ్యం క్షీణింపజేశాయి. ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారడంతో, చరణ్ వైద్యం నిమిత్తం హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పటల్ కి తరలించబడ్డాడు. వైద్య నిపుణుల వివరాల ప్రకారం, చికిత్స కోసం సుమారు 5 లక్షల రూపాయల ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు.ఈ పరిస్థితిని తెలుసుకున్న స్థానికులు, స్నేహితులు కొంత ఆర్థిక సహాయం అందించారు. అయితే, మరింత వైద్య సహాయం అవసరం ఉండడంతో, సర్వతా దాతలు ముందుకు వచ్చి ఈ నిరుపేద విద్యార్థి ప్రాణాలను కాపాడేందుకు సహాయం చేయాలని వేడుకుంటున్నారు. చరణ్ తండ్రి జయరాం, ఒక సాధారణ కూలీ, వైద్యం ఖర్చులు భరించేందుకు తగిన సొమ్ము లేక, కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చరణ్‌ను కాపాడేందుకు దాతల సహాయం అత్యవసరం. నిరుపేద కుటుంబానికి చెందిన ఈ బాలుడి జీవితానికి మీరు చేయగలిగిన సహాయం ఎంతో విలువైనది. మీ చిన్న విరాళం అతనికి కొత్త ఆశను, జీవితం తెచ్చిపెట్టగలదు. సహాయం చేయదలచిన వారు, ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా 6302609114 ఈ నెంబర్ కి తమ విరాళాలు పంపించగలరు.

# 481 మంది రిపోర్ట్ 'సర్'

**ఖమ్మం-నవభూమి :** డీఎస్సీ-2024లో మంగళవారం అర్ధరాత్రి వరకు నియామక ఉత్తర్వులు అందుకున్న నూతన ఉపాధ్యాయులు బుధవారం జిల్లాలోని తమకు కేటాయించిన పాఠశాలల్లో రిపోర్ట్ చేశారు. 520 మంది వివిధ కేటగిరీలలో డీఎస్సీలో ఎంపిక కాగా.. వారిలో 516 మందికి మాత్రమే పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. 21 మండలాల్లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ స్కూళ్లలో పలు కేటగిరీలలో రిపోర్ట్ చేస్తున్న ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు, టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సాదర స్వాగతం పలికారు.

# జూలురుపాడు మండల విద్యాశాఖ అధికారిగా బాణోత్ జుంకీలాల్





**జూలూరుపాడు,అక్టోబర్ 17 (నవ భూమి (ప్రతినిధి) :**ప్రభుత్వం ఇటీవల జిల్లాలోని అన్ని మండలాలకు పూర్తి స్థాయి విద్యాశాఖ అధికారులను నియమించింది.దానిలో బాగంగా మండలానికి పడమట నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు గా పనిచేస్తున్న బాణోత్ జుంకీ లాల్ ను నియమించారు. గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొత్తగూడెం తో పాటు మిగతా మండలాలకు ఎం ఈ ఓ పనిచేసిన అనుభవం వుంది.నూతనంగా భాద్యతలు తీసుకున్న జుంకిలాల్ ను తెలంగాణ రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయ సంఘ బాధ్యులు మర్యాద పూర్వకంగా కలుసుకొని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల శాఖ బాధ్యులు,ఉపాధ్యాయులు ధరావత్ భాస్కర్, సీతారాములు,నరసింహారావు,స్వరూపరాణి, నేతాజీ,జైత్రాం,హనుమాన్ పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ

**ఖమ్మం, నవభూమి ప్రతినిధి అక్టోబర్ 17 :** ఇటీవల భాగ్యనగరంలో ఒక ఆలయం పై జరిగిన దాడిని కొందరు ఆకతాయి చర్యగా భావిస్తూ సదరు సంఘటనను ఆషమాషి గా తీసిపడేస్తున్నారని, ఇది కేవలం ఆలయంపై మాత్రమే కాదు మన విశ్వాసాల మీద జరిగిన దాడి వంటిదని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు , మల్కాజిగిరి ఎంపీ. ఈటెలరాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం నగరంలోని ఏడవ డివిజన్ పరిధిలో గల ఖానాపురం ప్రాంతంలో గురువారం ఖానాపురం చత్రపతి శివాజీ సంకల్ప యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చత్రపతి శివాజీ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇది క్షమించరాని నేరమని , ఏ మతం కూడా మరో మతం మీద దాడి చేయడానికి ఒప్పుకోదని , పోలీసులు నిందితులపై ఉక్కు పాదం మోపాలని అన్నారు. భారతీయ సంస్కృతి , సాంప్రదాయానికి నిలువెత్తు రూపం వీర శివాజీ , ఆయన విగ్రహం ఇక్కడ ఏర్పాటు చేసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. చత్రపతి శివాజీ వంటి వీర పురుషుడి గురించి భావితరాలకు ఒక సందేశం , ఒక స్ఫూర్తిగా ఈ విగ్రహం నిలుస్తుంది అన్నారు. అనేక మతాలకు భారతదేశం నిలయమని , ఇక్కడ అత్యధిక శాతం హిందువులు ఉన్నారని , కొంతమంది పిడికెడు మంది వ్యక్తులు ఈ దేశంలో అశాంతి రగిలించడానికి , విషపు బీజాలు నాటడానికి ప్రయత్నాలు చేస్తున్నారని , వీటిపై కూడా పోలీసులు దృష్టి సారించాలని సూచించారు. కొంతమంది నాయకులు , కొన్ని పార్టీలు ఆలయం పై దాడి లాంటి ఉన్మాద చర్యలకు వాసటగా నిలుస్తున్నారని, ప్రశాంత వాతావరణంకు మారుపేరుగా ఉన్న భాగ్యనగరంలో ఇలాంటి చర్యలు అశాంతి ప్రభలే ప్రమాదాన్ని కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర ఇలాంటి విషయాలపై సంపూర్ణ సమాచారముందని , తగిన సమయంలో తగిన విధంగా స్పందించడం ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ప్రముఖ డాక్టర్ శీలం పాపారావు , స్థానిక కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ , ఖానాపురం కు సంబంధించిన వివిధ పార్టీల నాయకులు , ఖానాపురంకు చెందిన వివిధ సంఘాల నాయకులు పార్టీలతీతంగా చత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఖమ్మం జిల్లాలో మోస్తరు వర్షం



**ఖమ్మం-నవభూమి :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం బుధవారం ఖమ్మం జిల్లాలో కన్పించింది. ఉదయం నుంచి మేఘాలు అలుముకోవడంతో వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో ఖమ్మం నగరంతోపాటు నగర శివారు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. 30 నిమిషాలపాటు నగరంలో చెదురుమదురు వర్షం కురవడంతో ద్విచక్ర వాహనదారులు స్వల్ప ఇబ్బందులకు గురయ్యారు.రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, వైరా మండల కేంద్రంలో మాత్రం సాయంత్రం అర్ధగంటపాటు భారీ వర్షమే కురిసింది. ఇక పెనుబల్లి మండలంలో చిత్రమైన పరిస్థితి కన్పించింది. ఉదయం ఎండ దంచి కొట్టింది. మధ్యాహ్నం మబ్బులు కమ్మాయి. సాయంత్రం వర్షం కురిసింది. అది తగ్గినప్పటి నుంచి ఉక్కపోత మొదలైంది. ఇక్కడ 10 రోజులుగా వాతావరణంలో మార్పులు కన్పిస్తూనే ఉన్నాయి. మబ్బులు, గాలులు లేకుండా ఒక్కసారిగా వర్షం కురుస్తోంది.

## నేడు శబరి స్మృతియాత్ర

**భద్రాచలం,-నవభూమి :** అయోధ్య రాముడి కరుణతో ముక్తి పొందిన గిరిజన మహా భక్తురాలు శబరి స్మృతియాత్ర భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఏటా ఆశ్వయుజ మాసంలో పౌర్ణమి రోజు గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా మహిళలు, యువతుల నృత్యాలు, ఆటపాటల నడుమ యాత్ర నిర్వహించడం ఆనవాయితీ.ఇందులో భాగంగా ఉదయం 6.30 గంటల నుంచి గిరిప్రదక్షిణ, 8.30 గంటల నుంచి చిత్రకూట మండపంలో నిత్యకల్యాణం, 11.30 గంటలకు వివిధ రకాల పండ్లు, పుష్పాలతో రామయ్యకు పుష్పాంజలి కార్యక్రమం నిర్వహిస్తారు. గిరిజనులు తమ తమ గ్రామాలు, గూడేల్లో లభ్యమయ్యే పూలు, పండ్లను సేకరించి రామయ్యకు సమర్పించడం స్మృతియాత్ర ప్రత్యేకత.గిరిజనుల చెంతనే రామయ్య కల్యాణం భద్రాచలం ఈవోగా రమాదేవి బాధ్యతలు చేపట్టిన తర్వాత గిరిజన గ్రామాలకు ప్రచార రథాన్ని పంపించి అక్కడి ప్రజల మధ్య రామయ్య కల్యాణ మహోత్సవం నిర్వహించడం మొదలుపెట్టారు. దీంతో రామయ్య అందరివాడనే భావన కల్పించడం.. తమ ఇళ్ల ముంగిళ్లలోకి దేవుడే వచ్చాడని గిరిజనులు భావిస్తున్నారు.ఈ ఏడాది అశ్వారావుపేట మండలం వినాయకపురంలో గురువారం శబరి స్మృతి యాత్ర ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు గ్రామంలో రామయ్య ప్రచార రథంతో శోభాయాత్ర నిర్వహించిన తర్వాత ముత్యాలమ్మ ఆలయంలో కల్యాణం నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఏపీలోని వీఆర్‌పురం వద్ద ఉన్న శబరి నది సమీపంలో దేవస్థానం ఆధ్వర్యంలో అభిషేకం, వస్త్రాలు, పండ్ల సమర్పణ కార్యక్రమం చేపట్టనున్నారు.



# వీడని తండా వాసుల ముంపు బాధలు





**తిరుమలాయపాలెం-నవభూమి :** తిరుమలాయపాలెం మండలంలోని రాకాశితండావాసులను ముంపు బాధలు వీడలేదు. ఆకేరు వాగు వరద బీభత్సంతో ముంపు ప్రవాహానికి గురై ఇళ్లు కూలిపోయాయి. పంటపొలాలు ఇసుకమేటలు వేశాయి. ఇండ్లలోని సామాన్లు మొత్తం కొట్టుకుపోయాయి. 20మంది రైతులకు చెందిన సుమారు 150 బస్తాల వడ్లు తడిసాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో పర్యటించిన రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వారికి స్వయంగా హామీ ఇచ్చారు.కానీ నేటివరకు ఆ తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన నాథుడు లేడు. నష్టపోయిన ప్రజలను అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చినప్పటికీ మంత్రులు, అధికారుల హామీలు అమలుకావడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ముంపునకు తడిచిన వడ్లను ఎండబెట్టి రాశులు పోసి పట్టాలు కప్పారు. వానలకు మళ్లీ వడ్లు తడిచి మొలకలు వస్తున్నాయి. రాశుల వద్ద కాపలా కాయలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై మంత్రి పొంగులేటికి తమ గోడు వెళ్లబోసుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని గిరిజనులు వాపోతున్నారు.ఆకేరు వరద ప్రవాహానికి 50 కుటుంబాలకు చెందిన 300 ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయి, వ్యవసాయ భూములు రాళ్ల కుప్పలుగా, ఇసుక మేటలుగా మారాయి. పచ్చని పంటలు పండే భూములు సాగు చేయడానికి పనికి రాకుండా పోయాయి. అట్టి భూములు మళ్లీ సాగు చేసుకునే విధంగా తయారు చేసుకోవాలంటే ఎకరం ఒక్కంటికి రూ.లక్షకు పైగానే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా ప్రభుత్వం పైసా సాయం కూడా అందించలేదు. దీంతో చేసేదేమీలేక రైతులు కూలీలుగా మారి బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారు.అందిన సాయమూ అరకొరే.రాకాశితండాలో 77 కుటుంబాలకు గాను 66 కుటుంబాల వారికి ప్రభుత్వం రూ.16,500 చొప్పున వారి అకౌంట్లలో జమ చేశారు. మిగిలిన కుటుంబాల వారికి ఒక్కపైసా రాలేదు. దాతలు అందించిన ఆర్థికసాయం తప్ప ప్రభుత్వం తమకు ఏమీ సాయం చేయలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. నష్టపోయిన పంటలకూ పైసా ఇవ్వలేదని, కూలిపోయిన ఇళ్లు, కొట్టుకుపోయిన సామాన్లకు పరిహారం చిల్లిగవ్వ అందలేదని చెబుతున్నారు. మంత్రికి మొర పెట్టుకున్నా ఫలితం లేదు.తడిచిన వడ్లను కొనుగోలు చేస్తామని మంత్రి పొంగులేటి, కలెక్టర్ హామీ ఇచ్చి నెలరోజులైనా ఇంకా కొన్నవారు లేరు. గాలివానలకు పట్టాలు ఎగిరిపోయి వడ్లు తడుస్తున్నాయి. రాశుల వద్ద కాపలా కాయలేక ఇబ్బంది పడుతున్నాము. మా వడ్లు 80 బస్తాలు తడిచి మొలకలు వస్తున్నాయి. ఏమి చేయాలో తోచడం లేదు.సర్కారు నుంచి సహకారం శూన్యం..చాలామంది దాతలు నిత్యావసర వస్తువులు అందించారు. ప్రభుత్వం నుంచి మాత్రం అరకొర సహాయమే అందింది. పంటలు, దెబ్బతిన్న భూములకు చిల్లగవ్వ కూడా ఇవ్వలేదు. మంత్రులు, జిల్లా అధికారులు హామీలు ఇచ్చారు తప్ప అమలు కాలేదు. కొంతమందికి రూ.16 వేలు కూడా రాలేదు.

# 'మున్నేరు' బాధితులను ఆదుకోవాలి

**రఘునాథపాలెం -నవభూమి :** మున్నేరు ముంపు ప్రాంత ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. మున్నేరు వరద ఉధృతి ముంపు ప్రాంత ప్రజలకు తీరని నష్టాన్ని మిగిల్చిందని అఖిలపక్ష పార్టీల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఆర్‌జేసీ కృష్ణ, సీపీఎం నాయకులు నున్నా నాగేశ్వరరావు, ఎర్ర శ్రీకాంత్ మాట్లాడుతూ.. మున్నేరు వరద ప్రవాహంతో ముంపు ప్రజలు సర్వస్వాన్ని కోల్పోయారన్నారు.ఇది జరిగి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు ఏమాత్రం ఆర్థికసాయం అందలేదన్నారు. కేవలం కంటితుడుపు చర్యగా కొంతమందికి మాత్రమే రూ.16,500 అకౌంట్లో జమ చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. అర్హులైన వందల మంది నిరుపేద బాధితులకు పరిహారం నేటికీ అకౌంట్లో నగదు జమ కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మున్నేరు బాధితులను ఆదుకునేందుకు బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించి తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మున్నేరు ముంపునకు గురైన ప్రతి కుటుంబానికీ రూ.3 లక్షల నష్టపరిహారం అందించాలని కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి కేవలం కట్టుబట్టలే మిగిలాయని, ఒక్కో కుటుంబం 5 నుంచి రూ.10 లక్షల వరకు నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు మాటేటి నాగేశ్వరరావు, రుద్రగాని శ్రీదేవి, ఉపేందర్, మాటేటి కిరణ్‌కుమార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

